
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 16 నవంబరు 2024



## ఫటాఫట్



### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● పులివెందుల ఆర్డీవో భానుశ్రీ

పులివెందుల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకమైన సేవలందించడమే లక్ష్యంగా రెవెన్యూ వారు పనిచేస్తున్నారని పులివెందుల ఆర్డీవో భానుశ్రీ అన్నారు. రెవెన్యూ గ్రామ సభలు, రెవెన్యూ కార్యాలయాలకు వచ్చేవారితో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి' అడిగిన ప్రశ్నలకు ఆమె ఫటాఫట్ సమాధానాలు ఇచ్చారు.

**ప్రశ్న:** రీసర్వే సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు.

**జవాబు:** రీసర్వేకు సంబంధించిన రైతుల సమస్యలను రెవెన్యూ గ్రామసభల ద్వారా పరిష్కరిస్తున్నాం. నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నాం.

**ప్రశ్న:** ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై..

**జవాబు:** డివిజను పరిధిలో చక్రాయపేట, ఎర్రబల్లె రీచ్‌లకు అనుమతులున్నాయి. అనుమతులు పొందినవారు మాత్రమే తవ్వకాలు, రవాణా సాగించాలి. అక్రమ తవ్వకాలు సాగిస్తే మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల ఉమ్మడి కార్యాచరణతో నిలువరిస్తాం.

**ప్రశ్న:** ఇసుక అక్రమ రవాణా మీ దృష్టికి వచ్చిందా?

**జవాబు:** ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. నియంత్రణకు అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రత్యేక చర్యలు చేపడతాం. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి ఫైన్ వేస్తున్నాం. మైనింగ్ ప్రాంతం కీలకం. పట్టాభూములైనా ముందుగా మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి పొందిన తరువాత మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణా జరపాలి. పట్టాభూముల్లో అనుమతి పొందినవారైనా వాల్టా, ఎన్‌జీటీ నిబంధనలు పాటించాల్సిందే. లేదంటే కేసులు నమోదు చేస్తాం.

**ప్రశ్న:** ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నారా?

**జవాబు:** ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు సంబంధించి తహశీల్దార్లకు నిర్దిష్ట మార్గదర్శకాలు ఇచ్చాం. అందుకనుగుణంగా నిర్ణీత కాల వ్యవధిలో సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయానికి వచ్చే అర్జీలు కూడా నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరిస్తున్నాం. జాప్యం జరిగితే అందుకు కారణాలు వివరిస్తున్నాం.

**ప్రశ్న:** అనధికార లేఅవుట్లకు సంబంధించి..


**జవాబు:** డివిజను పరిధిలో మొత్తం అనధికార లేఅవుట్లకు సంబంధించి సమాచారం తీసుకుంటున్నాం. అందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించం.

**ప్రశ్న:** పట్టాదారు పాసుపుస్తకాల జారీలో..

**జవాబు:** గతంలో రైతులకు సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాలు తహశీల్దారు కార్యాలయానికి వచ్చేవి. వాటిని ఎంట్రీ చేసుకుని వీఆర్వోలు రైతులకు ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం పట్టాదారు పాస్ పుస్తకాలు రైతుల ఇంటికి వెళుతున్నాయి. ఒకవేళ రాకపోతే రీప్లేస్ చేసుకోవాలి.

- గోదాముల్లో.. పందికొక్కుల్లా..
- రేషన్ బియ్యం బస్తాలకు కన్నం
- క్వింటాకు ఐదు కిలోలు తగ్గుతున్న వైనం
- తూకం లేకుండానే నేరుగా రేషన్ డీలర్లకు అందజేత
- కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోత

ప్రభుత్వం పేదలకు ప్రతినెలా బియ్యం, కందిపప్పు, చక్కెర ఇతర నిత్యావసర వస్తువులను అందిస్తోంది. అయితే ఆ పేదల బియ్యాన్ని కూడా కొందరు వదలడంలేదు. పౌరసరఫరా గోదాముల్లో పందికొక్కుల్లా మారి బియ్యం బస్తాలకు కన్నం వేస్తున్నారు. తూకం వేయకుండా రేషన్ డీలర్లకు నేరుగా బియ్యం బస్తాలు ఇస్తున్నారు. దీంతో క్వింటాకు 5కిలోల మేర తక్కువ వస్తున్నాయి. వెరసి కార్డుదారులకు కూడా తక్కువ ఇచ్చే పరిస్థితి వచ్చింది. ఇలా నెలనెలా 440 టన్నుల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తుండడం తీవ్రవిమర్శలకు తావిస్తోంది.



కడపలో పౌరసరఫరాల శాఖ గోదాములో రేషన్ బియ్యం స్టాక్ పాయింట్

# బొక్కేస్తున్నారు

(కడప - ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ గోదాముల్లో బియ్యం బొక్కేయడంపై ఇటీవల జరిగిన జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. 50 కిలోల బస్తాకు 3 కిలోలు తక్కువ వస్తున్నాయంటూ ఆమెకు వివరించారు. దీంతో పౌరసరఫరా గోదాముల్లో జరుగుతున్న తూకాల్లో గోల్‌మాల్ వ్యవహారం బయటికి వచ్చింది. జిల్లాలో 1239 రేషన్‌షాపులు ఉన్నాయి. మొత్తం కార్డులు 5,36,532 ఉన్నాయి. ప్రతి నెలా 17,62,479 మందికి బియ్యం ఇతర నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 366 రేషన్ బండ్ల ద్వారా పంపిణీ జరుగుతోంది.

**గోదాముల్లోనే కన్నం..**

జిల్లాలో కడప, పోరుమామిళ్ల, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, ముద్దనూరు, ఎర్రగుంట్ల, చెన్నూరులో మొత్తం 13 పౌరసరఫరాల గోదాములు ఉన్నాయి. ఇక్కడినుంచే రేషన్ షాపులకు బియ్యం పంపిణీ అవుతుంది. ఒక్కో బస్తా 50 కిలోల 660 గ్రాములు ఉంటుంది. 660 గ్రాములు సంచి బరువు పోతుంది. నికరంగా 50 కిలోల బియ్యం ఉండాలి. నిబంధనల ప్రకారం స్టాకు పాయింట్లలో తూకం వేసి డీలర్లకు అందివ్వాల్సి ఉంది. అలా కాకుండా ఒక్క బస్తాకు 50 కిలోల 600 గ్రాముల చొప్పున లెక్కవేసుకుని చౌక దుకాణాలకు బియ్యం బస్తాలు ఇస్తున్నారు. ఇలా ఇస్తున్న బస్తాల్లో ఒక్కోదానిపై సుమారు 3 కిలోల తరుగు వస్తుందని డీలర్లు వాపోతున్నారు. కార్డుదారులు ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం ఇస్తారు. అయితే జిల్లాలో ఉండే కార్డులు, సభ్యుల ప్రకారం 5 కిలోల చొప్పున బియ్యం ఇస్తే 8812.88 టన్నులు అవసరం అవుతాయి. ఒక్కో బస్తాకు సరాసరి రెండున్నర కిలోలు తూకం తక్కువ అనుకున్నప్పటికీ క్వింటాకు ఐదుకిలోలు.. టన్నుకు 50 కిలోలు తగ్గుతాయి. ఈ లెక్కన ప్రతినెలా మొత్తం 440.64 టన్నుల షార్టేజీ వస్తుంది.

**కార్డుదారులకు కోత..**

స్టాకు పాయింట్లలో కొందరి చేతివాటం వల్లనే బియ్యం తూకం తక్కువ వస్తున్నాయనే విమర్శలున్నాయి. క్వింటాకు సరాసరి 5 కిలోలు తక్కువ ఉండడంతో ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు కొందరు డీలర్లు కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోతవిధిస్తున్నారు. తూకాల్లో కిరికిరి చేస్తుండడంతో కార్డుదారులు లాస్ అవుతున్నారు.

**సొమ్మంతా ఎవరి జేబుల్లోకి.?**

రేషన్ బియ్యం ఇప్పటికే పక్కదారి పడుతోంది. కొన్నిచోట్ల లబ్ధిదారులకు చేరకుండానే రేషన్ దుకాణాల నుంచి బియ్యం మాఫియా చేతుల్లో వెళుతోంది. అయితే ఇప్పుడు ఏకంగా గోడౌన్లలోనే బియ్యం బస్తాలకు కన్నం వేస్తున్నారు. ఒక్క నెలలో 440 టన్నుల బియ్యం నొక్కేస్తున్నారు. కిలో 20 రూపాయలు అనుకున్నా నెలకు దాదాపు రూ.9లక్షల విలువ చేసే బియ్యం బొక్కేస్తున్నారు. ఈ బియ్యం సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళుతుందన్న చర్చ సాగుతోంది. కొందరు డీలర్లు తమకు తూకం వేసి బియ్యం ఇవ్వాలని అడిగితే మీరంతా సక్రమంగా ఇస్తున్నారా అంటూ గోదాముల్లో కొందరు సిబ్బంది బెదిరిస్తున్నారని అంటున్నారు. అంతకు మించి గట్టిగా అడిగితే ఏమైనా ఇబ్బందులు వస్తాయోమేనన్న భయంతో డీలర్లు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. దీనివెనక ఖద్దరు పెద్దలతో పాటు.. అధికారుల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా ప్రయత్నించగా డీఎస్వో చాముండేశ్వరి స్పందించలేదు.

## శబరిమలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● ఆర్ఎం పి.గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం జనవరి వరకూ జిల్లాలోని వివిధ డిపోల నుంచి శబరిమలైకి ప్రత్యేక బస్సులను అద్దె ప్రాతిపదికన నడపనున్నామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుకు వీలుగా కడప రీజియన్ పరిధిలోని కడప (9959225774), మైదుకూరు (9959225781), ప్రొద్దుటూరు (9959225777), జమ్మలమడుగు (9959225778), బద్వేలు (9959225779), పులివెందుల (9959225780) డిపోల మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

**సీనియర్ సిటిజన్స్‌కు 25శాతం రాయితీ**

60 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణానికి టికెట్‌లో 25 శాతం రాయితీ ఇస్తామని ఆర్ఎం తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి కూడా రాయితీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందుకు వీలుగా వయసును ధ్రువీకరించే ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఓటర్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు భౌతికంగా కానీ, డిజిటల్‌గా సెల్‌ఫోన్‌లో అయినా చూపించి రాయితీ పొందవచ్చన్నారు.

| బస్సు రకం | సీట్లసంఖ్య | కి.మీ. అద్దె రూ.లలో |
|---|---|---|
| అమరావతి ఏసీ | 48 | 120 |
| ఇంద్ర ఏసీ | 40 | 79 |
| సూపర్‌లగ్జరీ | 35 | 57 |
| అల్ట్రాడీలక్స్ | 39 | 61 |
| ఎక్స్‌ప్రెస్ | 49 | 62 |
| పల్లెవెలుగు | 55 | 52 |

## స్థానిక అవసరాలకు ఉచిత ఇసుక

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



కడప కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అవసరాల నిమిత్తం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉచిత ఇసుక సరఫరా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం అమరావతి నుంచి ఉచిత ఇసుక పంపిణీ విధానంపై మైన్స్ మరియు జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, మైన్స్ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఇసుక బుకింగ్ రిజిస్ట్రేసన్లు, పంపకాల స్థితి, మాన్యువల్ రీచ్‌ల నిర్వహణ, టెండర్ల ఖరారు, ధరల స్థిరీకరణ, మినరల్ డీలర్స్ లైసెన్స్, బల్క్ యూజర్ సమస్యలు, ఇసుక సరఫరాలో అందిన ఫిర్యాదులు, పరిష్కారాలు తదితరాలపై కలెక్టర్లతో సమీక్షించారు. గ్రామాల్లో స్థానిక అవసరాలకు లభ్యమయ్యే ఇసుకను ఎడ్ల బండ్లతో పాటు, ట్రాక్టర్లలో ఉచితంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాణిజ్య పరంగా వినియోగిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మైన్స్ అండ్ జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ సూచనల మేరకు ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రాంతాల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా రవాణా చేసుకోవచ్చన్నారు. ఇసుక రవాణాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, గనులు భూగర్భశాఖ డీడీ సూర్యచంద్ర రావు, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, పోలీసు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా వ్యాప్తంగా 393.2 మి.మీ వర్షపాతం**

బంగాళాకాతంలో అల్పపీడనం వల్ల రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 393.2 మి.మీ వర్షపాతం నమోదయింది. బద్వేలు డివిజన్‌లో బద్వేలులో అత్యధికంగా 38.2 మి.మీ వర్షపాతం నమోదుకాగా, జమ్మలమడుగు డిజన్ పరిధిలో కొండాపురం మండలంలో 25.2 మి.మీ, కడప డివిజన్ పరిధిలో వల్లూరు మండలంలో అత్యధికంగా 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కడప , పెండ్లిమర్రి, కాశినాయన, పెద్దముడియం, రాజుపాలెం, దువ్వూరు, సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, వేంపల్లి, చక్రాయపేట, తొండూరు మండలాల్లో 5 మి.మీ లోపు వర్షపాతం మాత్రమే నమోదైంది.

## కరువు మండలాలను ప్రకటించాలి

● మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె/పులివెందుల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు సాగుచేసి రైతాంగం నష్టపోతున్నారని కరువు మండలాలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి శాసనమండలిలో కోరారు. శుక్రవారం జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించి 2023లో 20 మండలాల దాకా కరువు ఉన్నట్లు కలెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు నివేదిక పంపినా కరువు మండలాలుగా ప్రకటించలేదన్నారు. అలాగే ఈ ఏడాది 16 మండలాల్లో కరువు ఉన్న ట్లు కలెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు నివేదించినా కరువు మండలాల జాబితాలో ప్రకటించలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే రైతులకు సాయం అందుతుందన్నారు. రాష్ట్రంలో మండలానికి ఒకటి మాత్రమే రెయిన్ ఫాల్ నమోదు కేంద్రం ఉందని, మండలంలో రెండుమూడు చోట్ల ఏర్పాటుచేస్తే కచ్చితమైన వర్షపాతం నమోదవుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. కలెక్టర్ల నుంచి నివేదిక వచ్చినా కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాల నిబంధనల మేరకు కరువు మండలాలను ప్రకటిస్తారన్నారు. అయినా మరోమారు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రెయిన్ ఫాల్ కచ్చితంగా నమోదు అయ్యేలా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తామని దీనిపై ఇప్పటికే సీఎంతో చర్చించామని వివరించారు.

## ఇదేంది మేడమ్‌సార్..!

● తీరుమారని వైసీపీ




అధ్యక్ష స్థానంలో ఉన్న ఎంపీపీ భర్త బోదనబోయిన నారాయణ

కలసపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు అయితే.. పెత్తనం మాత్రం పురుషులదే. వైసీపీ పాలనలో మహిళలకు పదవులున్నా వారి భర్తలు, కొడుకులు, తమ్ముళ్లు, అన్నలు అధికార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనేవారు. అయినా వారినీ ఎవరూ అడ్డుకోలేదు.. ఎవ్వరూ ప్రశ్నించనూ లేదు. రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయినా కొందరు అధికారుల్లో మార్పు రాలేదు. వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధుల్లోనూ మార్పు రాలేదు. ఇప్పటికీ మహిళల స్థానంలో పురుషులను స్టేజి ఎక్కిస్తున్నారు. జ్యోతి ప్రజ్వలనా చేయిస్తున్నారు.

శుక్రవారం కలసపాడు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి కోసం ప్రణాళికలు ఏవిధంగా తయారు చేయాలనే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సర్పంచ్‌లు, మహిళా ఎంపీటీసీలు హాజరుకాలేదు. వారి భర్తలు, అన్నలు మాత్రమే హాజరయ్యారు. ముఖ్యంగా ఎంపీపీ బోదనబోయిన నిర్మలాదేవి అయితే ఆమె భర్త వచ్చారు. చెన్నారెడ్డిపల్లె సర్పంచ్ భర్త, కలసపాడు సర్పంచ్ బావ, కలసపాడు ఎంపీటీసీ భర్త, మిగతా చోట్ల కూడా మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సంబంధించిన మగవారు హాజరయ్యారు. ఎంపీపీ తరపున ఆమె భర్త జ్యోతిప్రజ్వలన చేసి స్టేజీపైన ఎంపీడీవో పక్కన ఎంపీపీ స్థానంలో దర్జాగా కూర్చుని తమ సందేశాన్ని ఇచ్చారు. ఈ విషయమై ఎంపీడీవో మహబూబ్‌బీని వివరణ కోరగా, అధికారిక కార్యక్రమం కాదని అన్నారు. మండల సర్వసభ్య సమావేశాల్లో ఎంపీపీనే పాల్గొంటున్నారు, ఇలాంటి చిన్న కార్యక్రమాల్లో మహిళల తరపున వారి బంధువులు పాల్గొంటారని చెప్పారు.

## నేడు పెద్దదర్గా గంధం మహోత్సవం

కడప కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడపలోని ప్రఖ్యాత పెద్ద దర్గా (అమీన్‌పీర్‌దర్గా) ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి 9 గంటలకు పీఠాధిపతి స్వగృహం నుంచి గంధకలశం తీసుకుని మేళతాళాలతో, ఫకీర్లతో, దేశప్రముఖుల పీఠాధిపతులు, పురప్రముఖులు, శిష్యకోటి బృందంతో దర్గా చేరుకుని మజార్ వద్ద గంధం సమర్పించి ఫాతిహా ఇవ్వనున్నారు. రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు.



## వైభవం.. కార్తీక దీపోత్సవం



వల్లూరు: పుష్పగిరి వద్ద నది గట్టున పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బద్వేలు టౌన్ : దుర్గమ్మగుడిలో కోటిదీపోత్సవం దీపాలంకరణ



కడప మృత్యుంజయేశ్వరాలయంలో..



వీరపునాయునిపల్లె : సంగమేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి



కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక దీపాల వెలుగులతో ఆలయాలు కళకళలాడాయి. పుష్పగిరి క్షేత్రానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజామునే పంచమనదీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి గట్టుపై అమ్మవారిని, గౌరీమాతను శివలింగాలు ఏర్పాటు చేసి దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం దీపాలను నదిలో వదిలి శివకేశవులను దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని శివాలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెండ్లిమర్రి మండలంలోని పొలతల మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం జ్వాలాతోరణం వెలిగించారు. బద్వేలులోని దుర్గమ్మ గుడి, శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కడపలోని మృత్యుంజయకుంట శివాలయం శుక్రవారం తెల్లవారుజాము నుంచే కిటకిటలాడింది. మహిళలు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. శివనామ స్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి.





ప్రొద్దుటూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెండ్లిమర్రి : పొలతలలో జ్వాలాతోరణం

## గురుకుల పాఠశాలలో మరోసారి పాము కలకలం

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో మరోసారి పాము కలకలం రేపింది. పాఠశాలలోని ఇంటర్మీడియేట్ కెమిస్ట్రి ల్యాబ్‌లో శుక్రవారం ప్రాక్టికల్స్ చేస్తుండగా పాము రావడంతో విద్యార్థినులు ఒక్కసారిగా పరుగులు తీశారు. పక్కనే ఉన్న కిటికీ నుంచి పాము ల్యాబ్‌లోకి వచ్చిందని ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. సిబ్బంది సహాయంతో దానిని చంపివేశామన్నారు. ఈ నెల 4వతేదీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు పాము కాటుకు గురైన సంగతి తెలిసిందే. వారు దాదాపు నాలుగు రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటన మరువకముందే మరోసారి పాము రావడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయాలని, పాములు, విషపురుగులు రాకుండా తగిన రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.



కెమిస్ట్రీ ల్యాబ్‌లోకి వచ్చిన పాము



చంపిన పామును చూపుతున్న సిబ్బంది

## కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలు



ములకలచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఓ కృష్ణజింక తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం ములకల చెరువు సమీపంలో చోటు చేసుకుంది. కుక్కల బారిన పడ్డ కృష్ణజింకను కూలీలు రక్షించారు. ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో ఉన్న టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని పంట పొలాల వద్దకు వచ్చిన కృష్ణ జింకపై కుక్కల గుంపు దాడి చేసింది. ఈ సమయంలో బొలెరో వాహనంలో అటుగా వచ్చిన టమోటా మండీ కూలీలు కుక్కల బారి నుంచి కృష్ణజింకను రక్షించారు. గాయపడ్డ జింకను వాహనంలో పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. దీంతో పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గాయపడ్డ కృష్ణజింకకు అటవీశాఖ అధికారులు స్థానిక పశువైద్యశాలలో చికిత్సలు అందించి కనుగొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్‌ఫొటో)

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో కొత్తమాధవరానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం పుత్తా శ్రీనివాసులు (56) తన భార్యతో కలసి స్థానిక మృకుండ మల్లేశ్వరాల యానికి వెళ్లాడు. పూజల అనంతరం తిరిగి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్న రైలు దూసుకువచ్చింది. దీంతో పట్టాల అవతల ఉన్న వారిని రావద్దని చేతితో సైగలు చేస్తుండగా రైలు బలంగా ఢీకొంది. దీంతో చేయి విరిగి దూరంగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ప్రమాదం నుంచి తప్పించుకుంది. వీరి కూతురు ప్రస్తుతం బీటెక్ చదువుతుండగా, కుమారుడికి మతి స్థిమితం లేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

## టమోటా మార్కెట్‌లో కూలీ మృతి

కురబలకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో చాంద్‌బాష(45) అనే కూలీ మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాష హమాలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలి పనుల నిమితం అంగళ్లు టమోటా మార్కెట్‌కు వచ్చి రాత్రి 8 గంటల సమయంలో లారీకి టమోటా క్రేట్‌లను లోడ్ చేస్తుండగా నేలపై పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు కుటుంబీకులకు తెలిపారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోటిరెడ్డిగారిపల్లె సమీపంలో సాగులో ఉన్న అరటి తోట

జిల్లాలోని తూర్పు ప్రాంతమైన రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి సాగు ఎక్కువ. ఇక్కడ బొప్పాయి, మామిడి తోటలు ఉన్నప్పటికీ అరటికి పెట్టింది పేరు. అలాంటిది ఇటీవల పడమటి మండలాల్లోనూ అరటిసాగు పెరుగుతోంది. అయితే ఇక్కడ ఎక్కువ ఆదాయాన్నిచ్చే యాలక్క రకం అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగు చేస్తే మూడు పర్యాయాలు దిగుబడి వస్తోంది. కూలీల, మందుల పిచికారి ఖర్చులు కూడా చాలా తక్కువ. పెట్టుబడి కంటే ఆదాయం రెట్టింపు వస్తుండటంతో రైతన్నలు అరటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

# అధిక లాభాల అరటి

- కూలీలు, మందుల పిచికారి ఖర్చులు చాలా తక్కువ
- ఒకసారి సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి
- పడమటి మండలాల్లో పెరుగుతున్న సాగు

ములకలచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం పంటల సాగు ప్రయోగాలకు నిలయంగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో విదేశీ పంట డ్రాగన్, అరబ్ దేశాల్లో పండే ఖర్జూరం సాగు చేసి రైతులు మంచి ఫలితాలు సాధించారు. అలాగే అనంతపురం జిల్లాలో అత్యధికంగా తమలపాకులు కూడా సాగు చేస్తున్నారు. తాజాగా రైతన్నలు అరటి సాగుపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. అరటి సాగుకు నీరు కూడా తక్కువగా అవసరమతుంది. మందుల పిచికారి ఒక్కసారి మాత్రమే చేస్తున్నారు. కూలీల అవసరం అతి తక్కువ. పంట సాగు చేసిన మొదటి ఏడాది మాత్రం ఖర్చు కొంచెం ఎక్కువగా ఉంటుంది. తర్వాత రెండేళ్లు ఖర్చు చాలా తక్కువ. ఈ కారణంగా అరటి పంట సాగుపై అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. పంట తొలిసారి సాగు చేసినప్పుడు రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. తరువాత ఏడాది ఖర్చు రూ.40వేల వరకు తగ్గుతుంది. మూడవ ఏడాది ఖర్చు మరింత తగ్గుతుంది. ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో అరటి సాగు ప్రయోగాత్మ కంగా సాగు చేసి మంచి ఫలితాలు సాధించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అరటి సాగులో ఉంది. దాదాపు 80 ఎకరాల్లో ఇక్కడ అరటి సాగులో ఉంది. వీటిలోనూ ఎక్కువమంది యాలక్క రకం సాగు చేస్తున్నారు. ఇవి షుగర్ జబ్బు ఉన్న వారు కూడా తినొచ్చు. దీంతో వీటికి ధర ఎక్కువ. ఇవి సాధారణంగా కర్ణాట కలో ఎక్కువగా సాగు చేస్తారు. ఇప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం లోనూ సాగు చేస్తుండటం విశేషం.

### నీటి వినియోగం తక్కువ

మిగిలిన పంటలతో పోలిస్తే అరటి పంట సాగుకు నీటి వినియోగం చాలా తక్కువ. డ్రిప్ ఇరిగేషన్ కింద పంట సాగు చేస్తున్నారు. అరటి పంటకు వేసవిలో రెండు లేదా మూడు రోజులకు ఒకసారి నీరు వదలాల్సి ఉంటుంది. తరువాత ఐదు రోజులకు ఒకసారి నీరు అందించినా ఫరవాలేదు. కర్ణాటక రాష్ట్రం నుంచి మొక్కలు తెచ్చి నాటుతున్నారు. ఎకరాకు 1200 మొక్కలు నాటాల్సి ఉంటుంది. సాగు చేసిన 10 నుంచి 11 నెలలకు మొదటిసారి దిగుబడి వస్తోంది. తరువాత ఏడాది ఏడు నెలలకే దిగుబడి వస్తుంది. మూడోసారి ఆరు నెలలకే దిగుబడి వస్తుంది. ఆశించిన స్థాయిలో ధరలు ఉంటే మాత్రం రైతు పంట పండినట్లే. ములకలచెరువు మండలం దుగుసానివారి పల్లెకు చెందిన రైతు యాలక్క రకం అరటి ఐదు ఎకరాలలో సాగు చేశారు. వీటిని బెంగళూరులోని దస్నేపేట బనానా మార్కెట్‌కు తరలించి విక్రయించారు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.4లక్షల ఆదాయం వచ్చిందని రైతు తెలిపారు. ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు కర్ణాటక రాష్ట్రం నుంచి జీ-6 రకం మొక్కలు తెచ్చి ఐదెకరాలలో అరటి సాగు చేశారు. మొదటి కాపులో రూ.10లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఇలా ఒకరిని చూసి ఒకరు పడమటి మండలాల్లోనూ అరటి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పులివెందుల నియోజకవర్గాల్లో మాత్రమే అరటి పెద్ద ఎత్తున సాగయ్యేది. ఇప్పుడు మెల్లగా పడమటి ప్రాంతానికీ విస్తరిస్తోంది. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో రైతులు దీనిపై మక్కువ చూపుతున్నారు.



పర్తికోట సమీపంలో యాలక్క రకం అరటి గెలలు



పర్తికోట నుంచి బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్న అరటిగెలలు

### ఖర్చు చాలా తక్కువ



అరటి తోట సాగుకు ఖర్చు చాలా తక్కువ. ఒకసారి పంట సాగు చేస్తే మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఐదు ఎకరాల్లో యాలక్క రకం సాగు చేసి రూ.5లక్షలు ఖర్చు చేశా. మొదటి ఏడాదే రూ.20లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు రెండవ ఏడాది దిగుబడి వస్తుంది. ఎక్కువ గాలులు వీస్తే తోటకు ఇబ్బంది. అరటి సాగు మంచి ఫలితాలు ఇస్తోంది.

**- మనోహర్‌రెడ్డి, దుగుసానివారిపల్లె, ములకలచెరువు మండలం**

### మందులు పిచికారి ఒక్కసారే



ఐదు ఎకరాల తోటకు ఒక్క సారి మాత్రమే మందులు పిచికారి చేశాము. తరువాత ఎలాంటి మందులు వాడలేదు. మంచి దిగుబడి వచ్చింది. వ్యాపారులే తోట వద్దకు వచ్చి అరటి కాయలు కొనుగోలు చేసి కోసుకెళ్లారు. మొదటిసారి రూ.10లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇక గెల 33-35 కిలోలు ఉంది. కష్టం కూడా తక్కువే.

**- రమణారెడ్డి, కోటిరెడ్డిగారిపల్లె, ములకలచెరువు మండలం**

## రైతులకు తగిన న్యాయం చేస్తాం

- రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్

గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్ర మాలకు గురైన రైతుల పొలాలను రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామని రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీని వాస్ అన్నారు. ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ భూములను ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకొని ఇబ్బందులు పెడు తున్నారంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్ రైతుల భూములు ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన వ్యక్తి భూములను రైతులతో కలిసి పరిశీలించారు.

గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ రెవెన్యూ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రైతుల నుంచి భూములు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ప్యారంపల్లె గ్రామానికి చెందిన కొందరి రైతుల పొలాలు వ్యాపారి కొన్న భూముల మధ్యలో ఉన్నాయి. దీంతో వ్యాపారి తన భూమి చుట్టూ రాతికూసాలు నాటి ఫెన్సింగ్ వేశాడు. ఈ క్రమంలో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. అంతేకాకుండా కొందరు రైతుల పొలాలను దౌర్జన్యంగా లాక్కొని అక్రమాలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన రైతులు డిప్యూటీ సీఎంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాస్‌లు ముందుగా ప్యారంపల్లె రైతులతో మాట్లాడారు. అనంతరం అక్రమాలకు గురైన రైతుల పొలాలను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందిని అడిగి రికార్డులను పరిశీలించి, వివరాలను సేకరించారు. భూముల వివరాలను పూర్తి స్థాయిలో సేక రించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అక్రమాలకు గురైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్యారంపల్లె రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

## రాత్రికి రాత్రే పంచాయతీ స్థలం ఆక్రమణ

వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ స్థలంలో రాత్రికి రాత్రే ఆక్రమణదారులు పాగా వేశారు. ఎవరి అనుమతి లేకుండా ఓ బంకును ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఇటీవల రెండు రోజుల క్రితం పంచాయతీ అధికారులు దుర్గంధంగా ఉన్న స్థలాలను శుభ్రం చేశారు. అయితే ఈ స్థలాల్లో గురువారం రాత్రికి రాత్రి ఓ బంకును ఏర్పాటు చేసి వ్యాపారాలకు తెరలేపారు. గురువారం ఉదయం నుంచి ఆ ప్రాంతంలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఆ బంకు ఎవరన్నది అధికారులకు సైతం వివరాలు తెలియరాక పోవడం గమనార్హం. గ్రామ పంచాయతీ స్థలాల్లో, అందులోనూ అధికారుల అనుమ తులు లేకుండా బంకును ఏర్పాటు చేశారంటూ సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై స్థానిక పంచాయతీ ఈవో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతంలో బంకు ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ స్థలాలలో అక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో రాత్రికి రాత్రి వెలసిన బంకు

## వయోవృద్ధుల గుర్తింపు కార్డులపై స్పష్టత

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వయోవృద్ధులకు రాయితీ టికెట్ల కోసం చూపించే గుర్తింపు కార్డుల విషయంపై ఆర్టీసీ అధికారులు స్పష్టత ఇచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్ల పైబడిన వయో వృద్ధులకు టికెట్టు ధరపై 25 శాతం రాయితీ వున్న విషయం తెలిసిందే. అయితే వయసు నిర్ధారణ కోసం వీరు చూపించే గుర్తింపు కార్డుల విషయంలో అనేక రకాల పేచీలు రావడం పరిపాటిగా మారింది. ఇది పలు వివాదాలకు కూడా దారితీసింది. దీన్ని గుర్తించి ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు కార్డుల గురించి పూర్తి స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఆపరేషన్స్) ఈ మేరకు కింది స్థాయి అధికారులు, ఉద్యోగు లకు పలు సూచనలు జారీ చేశారు. పలు వురు వయోవృద్ధులకు ఇతర రాష్ట్రాల్లో ఆధార్‌కార్డు నమోదైన కారణంగా రాయితీ టిక్కెట్లతో ప్రయాణానికి అంగీకరించడం లేదని ఈడీ వెల్లడించారు. కేవలం ఆధార్ కార్డు కోసమే ఒత్తిడి చేయడం కూడా భావ్యం కాదన్నారు. ఇక నుంచి ఆధార్ కార్డు సహా సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, రేషన్ కార్డుల్లో దేన్ని చూపించినా అంగకరించాలని ఈడీ స్పష్టం చేశారు. అది ఏ రాష్ట్రంలో జారీ అయినా సమ్మతించాలన్నారు. స్థానికతతో సంబంధం లేకుండా అన్నిరకాల ఐడీ కార్డులను ఆమో దించాలని కూడా ఆయన స్పష్టం చేశారు. కేవలం 60 ఏళ్లు పైబడి వుండాలన్న నిబంధనను మాత్రం పాటించాలని చెప్పారు. ఐడీ కార్డుల్లో కేవలం కార్డును మాత్రమే తప్పనిసరిగా చూపించాల్సిన అవసరం కూడా లేదని, డిజిటల్ రూపంలో వున్నా అంగీకరిం చాల్సిందేనని స్పష్టంగా పేర్కొన్నారు.

వయసు నిర్ధారణ కోసం మాత్రమే ఐడీ కార్డును చూపించాలన్న నిబంధనను గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. అవగాహన లేని కారణంగా వయోవృద్ధుల్లో ఆర్టీసీపైన అసహనం పెరుగుతోందని, దీనికి సంబంధించిన ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయని గుర్తు చేశారు. ఇక మీదట అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఈడీ సూచించారు.

## ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనితదీప్తి



రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకురాలు దుద్యాల అనితదీప్తి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియ మితులయ్యారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమె కడప మెప్మాలో కో-ఆర్డినేటర్‌గా పనిచేసేవారు. 2021లో తన పదవికి రాజీనామా చేసి రాజకీ యాల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో రైల్వే కోడూరు టికెట్టు కోసం చివరి వరకు పోరాడినా దక్కలేదు. ఆమె సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ పదవి ఇచ్చినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

## ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సుండుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగ ముని నాయక్‌కు శుక్రవారం జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్రమణ్యం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందడంతో విచారణ చేసి నివేదికను అందజేయా లని ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

సీకేదిన్నె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దివారి అతుల్‌కుమార్ (42) మృతిచెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు... చిత్తూరు నుంచి కడపకు బ్యాటరీ లోడుతో వచ్చిన లారీ గురువారం తెల్లవారుజామున గువ్వల చెరువు ఘాట్ దిగుతూ అదుపుతప్పి ఓ వైపునకు పడిపోయింది. దీంతో డ్రైవర్ అతుల్ ఆచూకీ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం లారీలోని సరుకు తొలగించి లారీని క్రేన్‌తో ఎత్తి చూడగా లారీ కింద ఇరుక్కుపోయిన ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



తహసీల్దారుకు నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కరించ కుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని 108 ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లా డుతూ 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, గత నాలుగేళ్ల కాలంలో తమకు వేతన సవరణ జరగలేదని, ప్రతి ఏడాదీ ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, అరియర్స్, ఈఎల్ డబ్బులను అరబిందో సంస్థ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్‌లో యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల దగ్గరే వసూలు చేస్తున్నారని వారు వాపోయారు. 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో తమకు ప్రతి నెలా రూ.4 వేలు అదనంగా ఇచ్చేవారని, దానిని గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దానిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానం అమలు చేయాలని, అంతర జిల్లాల బదిలీలు చేపట్టాలని, ఇది వరకే మరణించిన ఉద్యోగులకు రూ.20 లక్షల బీమా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై తాము ఇది వరకే అటు ప్రభుత్వానికి, ఇటు అరబిందో సంస్థకు విన్న వించుకున్నామని, ఈ నెల 25వ తేదీలోపు పరిష్కారం కాకుండా సమ్మెలోకి దిగడం తప్ప తమకు గత్యంతరం లేదన్నారు. ఈ కార్యక్ర మంలో 108 ఉద్యోగులు రహంతుల్లా, వెంకటాచలపతి, శ్రీనివాసులు, రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులు తట్టుకోలేక నా కుమార్తె వెళ్లిపోయింది

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

పులివెందులటౌన్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): వేధింపులు తట్టుకోలేక తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జొన్నా లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల పట్టణం ఆర్టీసీ డ్రైవర్ జయరాం కుమారుడు విష్ణువర్ధన్ 2014లో జొన్నా టెక్స్ టైల్స్ షోరూం యజమాని కుమార్తె హేమ లతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమా రుడు వికలాంగుడిగా పుట్టడంతో భార్యను భర్త విష్ణువర్ధన్ మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి హేమలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వీరబల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ సానిపాయి పంచాయతీ సర్పంచ్ నేతి ఆంజనేయులుపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో మస్తాన్‌వలీ శుక్రవారం గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రావెల్ పనులు చేయ కుండానే రూ.20 లక్షల వరకు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు రాంమోహన్, రమేశ్ ఆరోపించారు. బ్లీచింగ్ చల్లకుండా, నీళ్ల ట్యాంకు శుభ్రం చేయకుండానే నిధులు డ్రా చేశారన్నారు. పనులకు సంబంధించి రికా ర్డులు చూపించాలని డీఎల్‌పీవోను అడిగారు. సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు కింద ఉంచడంపై అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ నేతి ఆంజనేయులు మాట్లాడుతూ తాను చేసిన పనులకు రికార్డులున్నాయని, తమపై కక్ష గట్టి ఇలా విచారణలు చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలి

# ఉచితానికి ఈకేవైసీ కష్టాలు



- నమోదు అయితేనే లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు
- గ్రామీణప్రాంతాల్లో అవగాహన లేమి
- పలువురు పేదలకు చేకూరని లబ్ధి

పులివెందుల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత సిలిండరు పథకానికి ఈకేవైసీ ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందాలంటే తమ గ్యాస్ ఏజన్సీల ద్వారా ఆధార్‌తో లింకు చేయించుకోవాలని చెబుతున్నారు. సరైన అవగాహన లేక చాలామంది లబ్ధిదారులు పథకానికి దూరంగా ఉన్నారు. మరోవైపు డెలివరీ బాయ్‌లు సిలిండరు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఆ లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పినా పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం దీపావళి సందర్భంగా గత నెల 29 నుంచి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

పులివెందుల డివిజనులో 48229 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం పథకం కింద 33169, ఉజ్వల్ కింద 15060 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. 26350 మంది లబ్ధిదారులు మాత్ర మే ఈకేవైసీ చేయించుకున్నారు. 21879 మంది చేయించుకోలేదు. అయితే ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభించడంతో ఈ వారంలో మరో ఐదువేల మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 16879 మంది స్పందించలేదు. ఈకేవైసీ చేయించుకుంటేనే ఈ ఉచిత సిలిండర్లు వస్తాయి. మరోవైపు గ్యాస్‌కనెక్షన్లు పొందే సమయంలోనే ఆధార్ అనుసంధానం చేయించుకోవాల్సి ఉంది. గతంలో రేషన్‌కార్డు ఉండి ప్రస్తుతం వివిధ కారణాలతో తొలగించిన వారికి కూడా ఈకేవైసీ నమోదు కాలేదు. కొంత మంది గ్యాస్ ఏజన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకున్నా ఎర్రర్ చూపిస్తున్నాయి. దీంతో వేలాది మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందలేని పరిస్థితి ఉంది. ఈ నేపద్యంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులను గుర్తించి వారి ఇంటివద్దకే చేయించేలా శ్రీకారం చుట్టారు. ఈ విషయంపై ఇప్పటికే తహసీల్దారు మహ్మద్ నజీర్ గ్యాస్‌ఏజన్సీ వారికి దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సిలిండర్లను అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంతవరకు సాధ్యపడుతుందో చూడాలి. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఏ కుటుంబంలో అయితే రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో అందులో ఒక కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంది. ఎవరైనా గ్యాస్ కనెక్షన్ చాలా సంవత్సరాలు వాడకుండా ఉంటారో వారు అనర్హులవుతారు. బుక్ చేసిన మొదటి సిలిండరుకు ఈ పథకం వర్తిస్తుంది. బుక్ చేసుకోగానే అర్హులకు నేరుగా 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు పడతాయి.

## ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



గండిలో మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో శుక్రవారం ఘనంగా ముగిశాయి. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వేదపారాయణ పండితులు, ప్రధాన అర్చకులు కేసరి అధ్యక్షతన పవిత్రోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, అంజనేయస్వామి మూల మంత్ర హోమం, సుదర్శనహోమం, పవిత్ర విసర్జన సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, మహాకుంభ ప్రోక్షణ, నివేదన, శాత్తుముర్రై అనంతరం తీర్థ ప్రసాదాలను నొసంగారు. ఉదయం 6 నుంచి 1 గంట వరకు ఉత్సవాలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గండి అంజనేయస్వామ దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా అంజన్నను పూలమాలలతో ముంచెత్తారు. దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్లు వెంకటస్వామి, కావలి విజయభాస్కర్, పాలక మండలి సభ్యులు, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన



బి.మఠం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి సంబంధించి శుక్రవారం బ్రహ్మంసాగర్ సరిహద్దు ప్రాంతంలోని స్థలాన్ని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ప్రజల కరెంటు కష్టాలు తీర్చేందుకు సోలార్ పవర్‌ప్లాంటు నిర్మాణం కోసం బ్రహ్మంగారిమఠంలో 8ఎకరాలు భూమిని కేటాయించేందుకు స్థలాన్ని పరిశీలించామన్నారు. స్థానిక ఐదురోడ్ల కూడలిలో ఐదేళ్లుగా కోర్టులో పెండింగులో ఉన్న సర్వే నెం.444 స్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం ఆయన వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. మండల తహసీల్దారు దామోదర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## పుష్పగిరి వద్ద యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడు గణేష్ (ఫైల్), విషాదంలో బంధువులు

వల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించడానికి పెద్దఎత్తున భక్తులు పుష్పగిరి క్షేత్రానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో నదిలో ఓ బాలుడు ప్రమాదంలో ఉండగా.. కాపాడబోయిన యువకుడు నీటి ఉధృతికి గల్లంతయ్యాయడు. బాలుడు మాత్రం ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కడప ఎన్జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లె గణేశ్ (27) తన భార్యతో కలిసి పుష్పగిరి క్షేత్రానికి వచ్చాడు. నదిలో బాలుడు కొట్టుకుపోవడం గమనించి కాపాడేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతికి గణేష్ కొట్టుకుపోగా చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో అక్కడున్న పోలీసులు, గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టారు. కానీ యువకుడి ఆచూకీ లభించకపోవడంతో ఈ విషయాన్ని సీఐ రోషన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి అక్కడకు వచ్చి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఫైర్ సిబ్బంది, రెస్క్యూటీంను తీసుకువచ్చి గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రి పొద్దుపోయే వరకు యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా, గల్లంతైన యువకుడు గణేష్ కడపలో పుస్తకాల వ్యాపారం చేసేవాడని, నెలన్నర క్రితం వివాహమైందని బంధువులు తెలిపారు.

## భార్యపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మమ్మ

కాశినాయన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో కట్టుకున్న భార్యపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని బాలరాజుపల్లె గ్రామంలో బసిరెడ్డి రామిరెడ్డి, సుబ్బలక్షుమ్మ దంపతులు నివశిస్తున్నారు. శుక్రవారం రామిరెడ్డి తనకు డబ్బులు ఇవ్వాలని సుబ్బలక్షుమ్మను అడిగాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఖర్చు చేస్తావంటూ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. రామిరెడ్డి ఆవేశంతో సుబ్బలక్షుమ్మను కత్తితో పొడిచాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గూడూరు ఆశీర్వాదం (ఫైల్)

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం (58) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సీ కాలనీలో ఆశీర్వాదం భార్య దేవమ్మలు నివాసముంటున్నారు. వీరికి మూడెకరాల సొంత భూమి ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, శనగ, పత్తి ఇతర పంటలు సాగుచేసేవాడు. పంటలు సక్రమంగా చేతికి రాక అప్పులపాలయ్యాడు. సుమారు రూ.3లక్షల మేర అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైలు ట్రాక్ వద్ద తీవ్ర గాయాలతో యువతి



రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం తీవ్ర గాయాలతో పడి ఉన్న యువతిని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది గాయపడిన యువతిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువతి తిరుపతిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతోంది. బద్వేల్ నియోజకవర్గం బి.కోడూరు మండలం రాజుపాలెం పంచాయతీ వెంకటశెట్టిపల్లెకు చెందిన బి.రామసుధగా రైల్వే పోలీసులు గుర్తించారు. స్థానిక పోలీసులు కూడా ఆరాతీస్తున్నారు.

## నెహ్రూ హయాంలో సహకార రంగానికి పెద్దపీట

- సీటీసీ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోనే సహకార రంగానికి పెద్దపీట వేశారని కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటరు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీసీఎంఎ కార్యాలయంలో శుక్రవారం జాతీయ సహకార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 71వ జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లో గత ఏడాది ఎంత ప్రగతి సాధించాం, ఈ ఏడాది ఎంత సాధించాం అనే లోటుపాట్లపై చర్చించుకునేందుకు ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సహకార రంగంలో ముఖ్యమైన వ్యక్తుల సలహాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ వైఎస్ సత్యానందం మాట్లాడుతూ రైతు ప్రయోజనం కోసం సహకారరంగం ఏర్పడిందన్నారు. సహకార బ్యాంకు ద్వారా రుణం పొందితే భవిష్యత్తులో రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సీటీసీ ఫణిరాజ్ మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం ఎంత ప్రాముఖ్యమో సహకారరంగంలో సంఘాలకు బైలా అంత ముఖ్యమైందన్నారు. సొసైటీలో ఆర్థికంగా నష్టం వస్తే ఆ సొసైటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుభాష్‌చంద్రబోస్, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లి మాట్లాడారు. సమావేశానికి ముందుగా సహకార పతకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సహకార సిబ్బంది, డీసీఎంఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పింఛను విధానం అమలు చేయాలి

ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సదానంద గౌడ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఏఐఎస్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో ఆయన మాట్లాడుతూ లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలు సీపీఎస్‌తో ఇబ్బంది పడుతున్నాయని.. చాలా రాష్ట్రాలు సీపీఎస్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. దేశవ్యాప్తంగా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుగా భావించి పాత పింఛను విధానం వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్రనాయకులు సురేశ్‌బాబు, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనరు రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తోందని.. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సహక కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధశాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సహకాన్ని పెంపొందించేందుకు ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. నూతన ఇండస్ట్రియల్ విధానానికి అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనన్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలను ఔత్సాహికపారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సహాయ సహకారాలను అందివ్వాలన్నారు. జిల్లాలో గోల్డ్, టెక్స్‌టైల్ క్లస్టర్ల ఏర్పాట్ల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిశ్రమల జీఎం చాంద్ బాషా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధన్, డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబరు శ్రీకాంత్ నాయక్, డిక్కీ కో-ఆర్డినేటర్ శివవంకర్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా : జేసీ



దర్జీపల్లె ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా చేపట్టాలని జేసీ అదితిసింగ్ అన్నారు. శుక్రవారం దర్జీపల్లెలోని ఇసుక క్వారీని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని.. ఎలాంటి అవకతవకలు లేకుండా ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నదిలోకి వెళ్లే వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, డంపింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టాక్‌పాయింట్‌ను పరిశీలించి రోజువారీగా ఎన్ని టిప్పులు ఇసుక వెళుతుంది.. సామాన్య ప్రజలు ఎంతమంది వస్తున్నారనే దానిపై పరిశీలించారు. సచివాలయంలో సౌలభ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇసుకను తరలించాలని సూచించారు. గ్రామంలో పెద్దఎత్తున టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తే రోడ్లు దెబ్బతింటాయని స్థానికులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ఇసుక తరలింపులో అక్రమాలకు చోటు లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరమణమ్మ, భూగర్భగనుల శాఖ సంచాలకులు సూర్యకుమార్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అంజి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొరవడిన నిఘా



- విజలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఒక కానిస్టేబుల్‌తోనే విధులు
- అధికారులు అంతంత మాత్రమే

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అధికారులు కూడా అంతంత మాత్రంగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై నిఘా కొరవడింది. అలాగే హోటల్స్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా. ట్రాన్స్‌పోర్టులలో బిల్లులు, రేషన్ బియ్యం , ఇసుక అక్రమ రవాణాతో పాటు నిల్వ పాయింట్లు, మైనింగ్, ఎరువుల విక్రయాలు, గ్రావెల్స్ తవ్వకాలు తదితర అంశాలపై విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడతారు. లోపాలున్న వారిపై కేసులు కూడా నమోదు కూడా చేస్తారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ శాఖలో సిబ్బంది కొరత కారణంగా విజిలెన్స్ దాడులు జరగడం లేదు. దీంతో ఇష్టానుసారం అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రాంతీ య కార్యాలయానికి సంబంధించి అదనపు ఎస్పీ, డీఎస్పీ ఉంటారు. అయితే అదనపు ఎస్పీ మాత్రమే ఉన్నారు. డీఎస్పీ అధికారి ప్రస్తుతం లేడు. అలాగే ముగ్గురు సీఐలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఎస్ఐలు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. అలాగే ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్ ఉండగా ప్రస్తుతం ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీవో ఒకరు ఉండగా ఆ స్థానం కూడా ఖాళీగానే ఉంది. ముగ్గురు డీఈలు ఉండాల్సి ఉంటే ఇరువురు మాత్రమే ఉన్నారు. ఇక తహసీల్దారు అయితే ఒకరు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం లేరు. ఈ స్థానం గత నాలుగేళ్ల నుంచి ఖాళీగానే ఉన్నట్లు తెలుస్తుంది. అసిస్టెంట్ జియాలజిస్ట్ ఒకరు ఉండాల్సింది.. అయితే ఇక్కడ ఎవరూ లేరు. ఇక జూనియర్ అసిస్టెంట్లు కూడా ఇక్కడ లేకపోవడంతో ఉన్న సిబ్బందికి పని భారంగా మారుతోంది. ఏదిఏమైనా ప్రభుత్వం సంక్షేమాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఈ శాఖ తనిఖీలు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సిబ్బంది కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు తనిఖీలు ముమ్మరంగా సాగుతాయని పలువురు చెప్పుకొస్తున్నారు.

## సమస్యలపై దృష్టి సారించాలని ఈడీకి వినతి



ఆర్టీసీ ఈడీని సన్మానిస్తున్న యూనియన్ నేతలు

కడప మారుతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఓడీ కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ యూనియన్ లకు చెందిన ప్రతినిధులు పి.సి. శేఖర్, పి.ఎం.రెడ్డి, ఎస్.ఆర్.ఆర్. మోహన్, ఏ.ఆర్ రాయుడు కోరారు. శుక్రవారం ఆర్ఎం కార్యాలయ సముదాయ భవనంలో గల ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్‌ను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండుకు నాలుగు వైపులా వర్షపునీరు నిల్వచేరడంతో ప్రయాణికులు బస్సుల కోసం బస్టాండ్‌కు చేరుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.

### 'సీమకు జరిగే అన్యాయంపై మాట్లాడాలి'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మాట్లాడాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు అభివృద్ధికే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల పేరుతో కర్నూలును న్యాయరాజధానిగా ప్రకటించారన్నారు.

## 'ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేత హర్షణీయం'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని సీపీఎస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట జనార్ధన రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీఎస్ అమలు చేస్తూ విడుదల చేసిన ఆర్డినెన్స్ కూడా రద్దు చేసినట్లు సీఎం ప్రకటించి నెలలు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదని, దీనిపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

### మంగళగౌరీదేవిగా అమ్మవారు

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంగం వీధిలో కార్తీక మహోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శుక్రవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారు మంగళగౌరీదేవిగా దర్శనమిచ్చారు. బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, నంబూరు కుళాయప్ప పాల్గొన్నారు.

**ప్రభుత్వ స్థలం ఇప్పించేందుకు కృషి:** బలిజ సంఘం కళ్యాణ మండపం ఏర్పాటుకు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్తానని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. మునిరెడ్డి దంపతులు మంగళగౌరీదేవిని దర్శించుకొని పూజలుచేశారు.




ఆ రహదారి వాహనదారులకు నరకం చూపిస్తోంది. ఎండాకాలం రోడ్డంతా గుంతలుగా కనిపిస్తే వానాకాలం వచ్చే సరికి నీటి కుంటలను తలపిస్తాయి. ఎండాకాలంలో వాహనాలు దెబ్బ తింటుండగా వానాకాలంలో ఆ బురద గుంతల్లో వెళ్లేవారి అవతారమే మారిపోతోంది. ఇదెక్కడో మారుమూల ప్రాంత రోడ్డు కాదండోయ్.. కడప నగరానికి కూతవేటు దూరంలోని మన చలమారెడ్డిపల్లె రోడ్డే.. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

## మాదిగ కార్పొరేషన్ డైరెక్టరుగా మల్లేశ్

చెన్నూరు/వినాయకనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా మండలంలోని గుర్రంపాడుకు చెందిన గన్నెపాటి మల్లేశ్ నియమితులయ్యారు. ఈయన టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా మాదిగ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని శుక్రవారం కలిసి సన్మానించారు. అలాగే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న గన్నెపాటి మల్లేశ్

## నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన జిల్లా నాయీ బ్రాహ్మణులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివాను జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణులు శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఆయన్ను కలిసిన వారిలో నాయీబ్రాహ్మణ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సంక్షేమ సంఘం అధ్యక్షుడు పత్తూరు గురుస్వామి, కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, చిన్నప్ప, కోటపాటి రమణ, వెంకటరత్నం, టీసీ సుబ్బరాయుడు, సురేశ్‌బాబు, నాగరాజ, సహదేవుడు, యలమందరావు పాల్గొన్నారు.



సదాశివాను కలిసిన జిల్లా నాయీబ్రాహ్మణులు




# వైభవంగా కార్తీక పౌర్ణమి



కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు

కడప కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. 'హరోం హర.. శంభో శంకర' అంటూ శివనామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఆ దీప కాంతులతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరాలయం, దేవునికడప సోమేశ్వరాలయం, గడ్డిబజార్‌లో వెలసిన బాలాజీ ఆలయం, ఆకులవీధిలో గల రాజరాజేశ్వరీదేవి ఆలయం, హౌసింగ్ బోర్డు కోదండరామాలయం, నబీకోట శివాలయం, ఎర్రముక్కపల్లె శివాలయం, ఆలంఖాన్‌పల్లె శివాలయం కార్తీక దీపోత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు.

**పుష్పగిరికి పోటెత్తిన భక్తులు**

వల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రానికి జిల్లా నలుమూలల నుంచి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే పంచమనదీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి గట్టుపై అమ్మవారిని, గౌరీమాతను శివలింగాలు ఏర్పాటు చేసి దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం దీపాలను నదిలో వదిలి తమ మాంగల్యం కాపాడాలని శివకేశవులను నమస్కారం చేశారు. అనంతరం శ్రీకామాక్షి సమేత వైద్యనాథేశ్వరున్ని కొండపై గల రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ, సంతాన మల్లేశ్వరున్ని దర్శించుకుని కాయకర్పూరం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వల్లూరులో ఉన్న భవానీ శంకరాలయంలో తెల్లవారుజాము నుంచే పత్యేక పూజలు చేశారు. గంగాయపల్లెలోని శివాలయం నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్పస్వాములు అయ్యప్ప పూజలు చేశారు. అయ్యప్పస్వాములు గ్రామోత్సవాన్ని వాయద్యాలు, కలశాలతోకన్యస్వాములు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి వేళ వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం కార్యక్రమం కూడా కార్యనిర్వాహకులు అందించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని అన్ని శివాలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. లేబాక, వల్లూరు, గంగాయపల్లె, పుష్పగిరిలో కార్తీక జ్వాలాతోరణాన్ని నిర్వహించారు.

**వీరపునాయునిపల్లె:** మండలంలోని పావన, పాపాఘ్ని, మొగమోరు నదుల సంగమం వద్ద వెలసిన సంగమేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. విఘ్నేశ్వరునికి సంగమేశ్వరునికి, సుబ్రమణ్యస్వామి, పార్వతిదేవిలకు భక్తులు పూజలు చేశారు. నందీశ్వరుని వద్ద మహిళా భక్తులు గోధుమపిండితో తయారు చేసిన ప్రమిదలను ఉంచి నెయ్యి వేసి కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే ఎస్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న అవధూత కాశిరెడ్డి నాయన ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి.

**చెన్నూరు :** మండలంలోని శివాలయాలు దీపకాంతులతో వెలుగొందాయి. చెన్నూరు మల్లేశ్వరాలయం, నాగేశ్వరాలయం, దక్షిణకాశిగా పేరొందిన శివాలపల్లె కాశీ విశ్వేశ్వరాలయాల్లో జ్వాలాతోరణం నిర్వహించారు. అలాగే ఆలయాల వద్ద అల్పాహారం, అన్నదాన వితరణ చేశారు. చెన్నూరు నాగేశ్వరాలయంలో లలితాంబదేవికి భక్తులు గాజుల అలంకరణ చేశారు. కుంకుమార్చనతో పూజించారు. సీతారామ సంకీర్తన క్షేత్రంలో గోపూజ చేశారు.

**చింతకొమ్మదిన్నె:** బయనపల్లి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, జ్వాలాతోరణం నిర్వహించారు. బుగ్గ శివాలయం, గంగమ్మతోపు శివాలయం, ఊటుకూరు శివాలయం, విశ్వనాథపురం శివాలయం, తదితర ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

**లింగాల:** మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వరాలయం, బోనాల చిన్నబావి శివాలయం, లింగాల సిద్దలింగేశ్వర ఆలయం, వెలిదండ్ల దేవరకోన ఆలయం, ఇప్పట్ల శివాలయం, అంబకపల్లె నూతికోన ఆలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. శివాలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

**చక్రాయపేట:** గండి క్షేత్రంలోని శివాలయం, చక్రాయపేటలోన వేంకటేశ్వర రాచరాయ దేవస్థానాలలో లాయర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో, సురభి శివాలయ, అద్దామల్రెడ్డి శివాలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. గండి అంజన్న సన్నిధిలో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దీపాలు వెలిగించారు.

**పొలతలలో...**

పెండ్లిమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొలతల క్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవదాయ శాఖ మంత్రి, దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మల్లేశ్వరస్వామి దేవస్థానం తరపున ప్రసాదం తయారు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలోని ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, బాల రాజారెడ్డి, నాగిరెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ చంద్రశేఖర్, ఆలయ పూజారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





చెన్నూరు: గాజుల అలంకరణలో లలితాంబదేవి



చెన్నూరు మల్లేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమికి తరలివచ్చిన మహిళలు





వల్లూరు: చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు పెడుతున్న మహిళలు






## విజయదుర్గాదేవి ఆలయంలో కార్తీక పూజలు

కడప కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి పవిత్ర నదీ జలాలతో నింపిన 18 విశేష కళశాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని చక్కగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్, కుటుంబ సమేతంగా ఉభయదారులతో కలిసి సహస్ర లింగార్చన నిర్వహించారు. అనంతరం యాగమండపంలో చండీహోమం, సుమంగళి పూజ గావించారు. ఆలయం అంతా కార్తీక దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందింది.

దీపంతో అర్చన చేస్తున్న ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్






## నేలకూలిన అరటి చెట్లు



లింగాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నూతలపల్లెలో శుక్రవారం వానాగాలికి సుమారు మూడు వేల అరటిచెట్లు నేలకొరిగాయి. తుమ్మలూరు విజయకుమార్‌రెడ్డి ఐదు వేల అరటి చెట్లు వేయగా మూడువేల చెట్లు నేలకొరిగాయని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విన్నవించారు.

### కడప అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా బండి జకరయ్య

కడప కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కడప నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా పారిశ్రామిక వేత్త, పీసీసీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్యను నియమిస్తూ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి పాటు పడతానని ఆయన తెలిపారు.

## ఆ స్కూలు అబ్బాయిలు ఆటల్లో అదరహో...

- వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా బాలుర పాఠశాల విద్యార్థులు



విజేతలైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణకుమారి

కమలాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కమలాపురం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల్లో అదరహో అనిపించారు. పలు క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఇటీవల జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటి పతకాలు కైవసం చేసుకున్నారు. రగ్బీలో అఖిల్‌గౌతం, సాయిరామక్రిష్ణ, వాలీబాల్‌లో చరణ్, కబడ్డీలో మణికుమార్, సైక్లింగ్‌లో ప్రేమ్‌కుమార్, చైతన్య క్రికెట్‌లో వరుణ్ విజేతలుగా నిలిచి బహుమతులు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం బాజాపర్వీన్, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.

## రాష్ట్ర విప్‌ను కలిసిన పవన్ కుమార్



ప్రభుత్వ విప్ మాధవీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పవన్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవీని శుక్రవారం మాజీ కార్పొరేటరు పవన్‌కుమార్ కలిశారు. ఆమెను దుశ్శాలువతో సన్మానించి పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. కడప నగర అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు.

### పుస్తక పఠనం ద్వారా జ్ఞాపకశక్తి

కడప కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన మాట్లాడారు.

# వైభవం దీపోత్సవం

శోభాయమానం...జ్వాలా తోరణం
మహిళలతో పోటెత్తిన ఆలయాలు
దత్తాపురంలో రావిచెట్టు,
వేపచెట్టుకు కల్యాణం




పోరుమామిళ్ల బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో, ఖాజీపేట శివాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో జ్వాలాతోరణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొండాపురం మండలం దత్తాపురంలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రావిచెట్టు, వేపచెట్టుకు కల్యాణం నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. వివరాల్లోకెళితే...

శివాలయాల్లో జ్వాలాతోరణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. శివాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, చండీహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారి మూలవిరాట్టును గాజులతో అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు స్వయంగా అభిషేకించారు. సాయంత్రం జ్వాలా తోరణం వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగం, నవరత్న లింగం, జలలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి జ్వాలాతోరణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## ఆకట్టుకున్న జ్వాలాతోరణం

బద్వేలుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు కార్తీక దీప కాంతులతో వెలుగొందాయి. రూపరాంపేట శివాలయం, శివానందస్వామి ఆలయం, చెన్నంపల్లె భవానీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఓంకారేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి అలంకరణ, జ్వాలాతోరణం కను విందుచేశాయి.

## సామూహిక సత్యనారాయణ వ్రతం...

బద్వేలునవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గౌరీశంకర్ నగర్‌లో నిర్మించిన రమాదేవి సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. చెన్నంపల్లె శివాలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి అన్నప్రసాదం స్వీకరించారు.

## కార్తీకదీపాలతో శైవక్షేత్రాలు

పోరుమామిళ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకదీపాలతో శైవక్షేత్రాలు దేదీప్య మానంగా వెలుగొందాయి. బాలా త్రిపుర సుందరీదేవి రామ లింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున, రాత్రి మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. మధ్యాహ్నం ప్రత్యంగిరా హోమం నిర్వహించారు. రాత్రి ఆకాశదీపం వెలిగించారు.

## రావిచెట్టు, వేపచెట్టుకు కల్యాణం

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాపురంలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రావిచెట్టు, వేపచెట్టుకు గ్రామస్తులు కల్యాణం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించారు. బాలప్పకోన, మల్లేశ్వరకోన, గండ్లూరు, చౌటిపల్లె కాశినాయన ఆలయాల్లో అన్నదానం చేపట్టారు. భజనలు చేశారు.

## కాశినాయన మండలంలో....

కాశినాయన, నవంబరు15(ఆంధ్రజ్యోతి): చెన్నవరం, వరికుంట్ల, కనెకలగుండం, అక్కంపేట శివాలయాలు, జ్యోతిక్షేత్రం, గొంటువారిపల్లె సమీప నీలకంఠ ఆశ్రమాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. చెన్నవరం శివాలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. నీలకంఠ ఆశ్రమంలో కార్తీక మహా దీపోత్సవం నిర్వహించారు. రాత్రికి కోలాటాలు, భజనలు ఏర్పాటు చేశారు.

## దువ్వూరు మండలంలో....

దువ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్దకు వెళ్లి దీపాలు వెలిగించారు. భీమలింగేశ్వర ఆలయం, పుల్లారెడ్డిపేటలోని త్రిపీఠికాలయంలో దేవున్ని దర్శించుకున్నారు.

## ఖాజీపేట మండలంలో....

ఖాజీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్రహారం శివాలయంలో, నాగనాదేశ్వరకోనలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కొండపైన మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కొండ కింద కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు.

## బి.మఠం మండలంలో....

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి సన్నిధానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. మఠాధిపతి వీరకుమారస్వామి దంపతులు చేపట్టారు. టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంటు గోపీబాబు, జిల్లా ధర్మప్రచార పరిషత్ సభ్యుడు చాపాడు వెంకటసుబ్బారెడ్డి కార్తీక పౌర్ణమి విశిష్టత వివరించారు.

## జమ్మలమడుగు మండలంలో....

జమ్మలమడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. సోమేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలాతోరణం నిర్వహించారు. కుండావారి వీధి శివాలయం, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం, కన్యతీర్థం బాలాత్రిపుర సుందరీదేవి ఆలయాల్లో కార్తీక పౌర్ణమిని నిర్వహించారు.

## అట్లూరు మండలంలో....

అట్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండూరు, అట్లూరు, కమలకూరు, కుంభగిరి, ముత్తుకూరు, మాడపూరు గ్రామాల శివాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

## వెల్లాలలో జ్వాలాతోరణం...

రాజుపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దీపాలతో శివలింగం ఆవిష్కరించారు. ఏటా కార్తీక పూజలు నిర్వహిస్తారు.




ఓంకారేశ్వర స్వామి ఆలయం(బద్వేలు)- సోమేశ్వరస్వామి దేవాలయం(జమ్మలమడుగు) జ్వాలాతోరణం

# పసుపు గౌరమ్మ ప్రతిష్ఠ - ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రతిష్ఠించిన గౌరమ్మ

ఎర్రగుంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పసుపు గౌరమ్మను ప్రతిష్ఠించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 20వ తేదీ వరకు అమ్మవారికి పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తారని ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు తెలిపారు. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐసీఎల్ కాలనీ ఉమామహేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. పోట్లదుర్తి చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన, దీపోత్సవం నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

# విజయవంతమైన సెమినార్



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ చివరి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన సెమినార్ విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి తెలిపారు. శుక్రవారం సీఎస్ఈ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 'అన్‌లాకింగ్‌ది ఫ్యూచర్స్ బై లెసెన్ లర్నింగ్ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లెసన్ లర్నింగ్ ప్రవర్తన ప్రభావం, వివిధ రంగాల్లో భవిష్యత్తులో రూపొందించే సామర్థ్యాల గురించి వివరించారు. లెసన్ లర్నింగ్ ఒక సాధనమని, టెక్నాలజీ, భవిష్యత్తుకు మూలమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● బెంగుళూరుకు చెందిన జీటెక్ జైన్సిక్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో మొత్తం 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వారికి ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షల వేతనం ఇస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

# పంచాయతీ అభివృద్ధిపై అవగాహన ఉండాలి

పోరుమామిళ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిధుల సద్వినియోగంపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ రమణారెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై మండల అధికారులు, ఎస్ఎస్‌జీ, ఈఓలకు వివరించారు. మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం పంచాయతీ కార్యదర్శి రాజీవ్ రెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ పాల్గొన్నారు.

## దువ్వూరులో....

దువ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ తరగతులు జరిగాయి. ఎంపీటీసీలు, సర్పంచులకు ఈ శిక్షణ జరిగింది. మంజూరయ్యే నిధులను వినియోగించే అంశంపై ఎంపీడీఓ రామక్రిష్ణయ్య వివరించారు. తహసీల్దారు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఖాజీపేటలో....

ఖాజీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేతలు, అధికారులు పంచాయతీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, వెలుగు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ దివిజ సంపతి, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాశినాయనలో....

కాశినాయన, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీడీఓ మైథిలీరెడ్డి సూచించారు. నర్సాపురంలో పంచాయతీల అభివృద్ధి 2025-2026 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి నివేదికల తయారు తదితర అంశాలపై పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రామక్రిష్ణారెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

పోరుమామిళ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యుల్ డేవిడ్‌రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక డిగ్రీకళాశాలలో ఆర్థిక అక్షరాస్యత పొదుపు బీమా అంశాలపై అవగాహన నిర్వహించారు. వీట్ సంస్థ సభ్యులు విద్యార్థులకు ఆర్థిక ప్రగతి, పొదుపు, బ్యాంకింగ్ బీమాపై అవగాహన ముఖ్యమన్నారు. విద్యార్థులకు కేంద్రప్రభుత్వ పథకాలు, ప్రాయోజిత పథకాలపై, అవగాహన కల్పించారు. వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, అధ్యాపకులు సులోచన, పర్వీన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో రోడ్డు సౌకర్యం మెరుగుపరుస్తాం

ప్రొద్దుటూరు , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్ల సౌకర్యం మెరుగుపరుస్తామని మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి టీడీపీ రాష్ట్రకార్యదర్శి కొండారెడ్డి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోషే, పొట్టు లక్ష్మీరెడ్డి ధనియాల రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి గురివిరెడ్డి టీడీపీ నేతలు బచ్చల ప్రతాప్, లక్ష్మణ్, జీసీ పుల్లయ్య, కుళాయి రెడ్డి, పీఆర్ డీఈ పాల్గొన్నారు.

## పార్టీకి కార్యకర్తలే బలం

టీడీపీకి కార్యకర్తలే బలం అని టీడీపీ యువనేత బచ్చల ప్రతాప్ పేర్కొన్నారు. గోపవరం పంచాయతీలో టీడీపీ సభ్యత్వ ప్రచారం చేపట్టారు. సభ్యత్వం తీసుకున్నసభ్యుడుకు రూ.5 లక్షల జీవిత బీమా ఉచితమన్నారు. కార్యకర్తకు పార్టీ అండగా వుంటుందన్నారు.

# వైభవంగా కోటి దీపోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శివదర్శనానంద స్పిరిచ్యువల్‌ట్రస్టు వ్యవస్థాపకురాలు శివదర్శనానంద సరస్వతి మాతాజీ ఆధ్వర్యంలో గీతాశ్రమంలో కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పరమశివుని ప్రతిమకు పల్లకిసేవ నిర్వహించారు. మాతాజీ మాట్లాడుతూ పరమశివునికి కార్తీకమాసం ఎంతో ప్రీతికరమని, ఈ మాసం విశిష్ఠతను భక్తులకు వివరించారు. అనంతరం జ్వాలాతోరణాన్ని వెలిగించి పరమశివున్ని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. భక్తులు కోటి దీపాలను వెలిగించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, చెన్నకేశవులు, వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

# వేరుకుల్లు తెగులు నుంచి పంటను రక్షించుకోవాలి

ఎర్రగుంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శనగపంటను వేరుకుల్లు తెగులు నుంచి కాపాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్యకుమార్, కృషి విజ్ఞాన్ కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ మాధురి ఇల్లూరులో సాగుచేసిన శనగపంటను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల శనగపంటకు వేరుకుల్లు తెలుగు సోకే అవకాశం ఉందన్నారు. లీటర్ నీటిలో 5గ్రాముల హెక్సాకోనోజోల్ మందు కలిపి పిచికారీ చేయాలన్నారు.



# అమ్మవారికి వడి బియ్యం సమర్పణ



ముద్దనూరు నవంబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు. భక్తులు అమ్మవారికి వడి బియ్యం సమర్పించారు. పిరమిడ్ ధ్యానకేంద్రం మాస్టర్ నాగమణి ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రగుంట్ల, నవంబరు 15 (ఆంధ్యజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణ సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిస్కం ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 1గంట వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్, హనుమనగుత్తి రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లిరోడ్డు, కోగటం, కేవీపల్లి, మాలేపాడు, చిన్నదండ్లూరు, ఆర్‌టీపీపీ, కలమల్ల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు గమనించాలని ఏఈ కోరారు.

# రాష్ట్ర డైరెక్టరుకు ఆర్యవైశ్యుల సన్మానం



బద్వేలు/బి.కోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పరిటాల వెంకటసుబ్బయ్యను బద్వేలు ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. బి.కోడూరు మండలం తుమ్మలపల్లె వాసి పరిటాల వెంకటసుబ్బయ్య ఇటీవల ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా నియమితులయ్యారు. గ్రామంలో ఈయన ఇంట్లో బద్వేలు శ్రీవాసవీ సిద్ద గురుస్వామి ఆర్యవైశ్య అన్న సత్రం కమిటీ ప్రెసిడెంట్ గోవిందయ్య, పేర్ల జనార్ధన్, బచ్చు వెంకటసుధాకర్, కె.రవి. నేలపాటి వెంకటసుబ్బయ్య, పేర్ల పార్ధసారధి, అమరక్రిష్ణ తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు.



# భూసమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేద దళితుల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సీపీఐ మండల నేత పెదుళ్లపల్లె ప్రభాకర్, నారాయణ డిమాండ్ చేశారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేశారు. అయితే ఇంత వరకూ భూములు ఎక్కడున్నాయో లబ్ధిదారులకు తెలియలేదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు మంజూరు చేసి లబ్ధిదారులకు భూములను కొలతలు వేసి చూపించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామన్నారు.

# కీటక జనిత వ్యాధులపై సదస్సు

బి.కోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేకవారిపల్లె పంచాయతీలో శుక్రవారం సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులు, ఫైలేరియా తదితరాల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా సర్వే చేయించి ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్నామని దోమల ద్వారావచ్చే జ్వరాలు, ముఖ్యంగా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, గున్యా, మెదడువాపు, జ్వరం, పచ్చజ్వరం తదితర వ్యాధులు రాకుండా ఉండాలంటే దోమలను నియంత్రణ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటిస్తే దోమలను గుడ్డు, లార్వా ప్యూపా దశలోనే చంపివేయగలుగుతామన్నారు. వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

అట్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు సాగుతోందని మండల టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం అట్లూరు క్రాస్ రోడ్డు ఉప్పుటూరు కాలనీల్లో ఇంటింటికీ టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల మాజీ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, యువ నేతలు మస్తాన్, పరమేశ్, బాబా చిన్నపరెడ్డి, గంగిరెడ్డి, నరసారెడ్డి, రిషికేశవ, గోపాల్, సంజీవ్ పాల్గొన్నారు.

# నేడు జ్యోతి మహోత్సవం

జమ్మలమడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోరగుడి గ్రామంలో 16వ తేదీ శనివారం చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం జరుగనుంది. గ్రామంలోని చౌడేశ్వరీదేవి ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం చౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవం పురస్కరించుకుని భక్తులు బిండెసేవ నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి అమ్మవారి ప్రతిరూపమైన జ్యోతులను తయారు చేసి ఆదివారం మేళతాళాల మధ్య అమ్మవారికి ఆగమం చెల్లిస్తారు. 18న గొడుగుల ఉత్సవం జరుగనుంది.

# నేడు 'స్కిల్'పై అవగాహన

ప్రొద్దుటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార రంగ పాత్రపై స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారని సహకార ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సహకార ట్రైనింగ్ సెంటర్‌లో సహకార రంగ పాత్రపై సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సహకార సంఘాల ప్రతినిధులు తప్పనిసరిగా హజరవాలని ఆయన కోరారు.

# ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్ తనిఖీ

ఎర్రగుంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసు స్టేషన్‌ను జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు.



# 'మత్తు పదార్థాల వినియోగంతో యువత నిర్వీర్యం'



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది సుబ్బారావు

జమ్మలమడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను వినియోగించడంతో యువత నిర్వీర్యమైపోతోందని సీనియర్ న్యాయవాది భూతమాపురం సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా 1985 నవంబరు 14న నాటి ప్రధాన మంత్రి మాదకద్రవ్యాల నిరోధక చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను వినియోగించుకుని చరిత్ర పఠించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్, కమిటీ సభ్యులు దాదాఖలందర్, అమీర్‌బాష, నరసింహులు, రామయ్య పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రికార్డు అసిస్టెంట్ విద్యార్థులకు సూచించారు. పుస్తకప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఆమె చూపించారు. స్థానికులు గ్రంథాలయంలో పుస్తక పఠనంపై శ్రద్ద చూపుతున్నారు.

**అట్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్‌బాబు శ్రీ విద్యాస్కూలు విద్యార్థులతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయంలో మేధాశక్తిని పెంచే పుస్తకాలు ఉన్నాయని విద్యార్థులు బాల్య దశ నుంచే గ్రంథాలయ పుస్తకాలు వినియోగించి మేధాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానికులు మస్తాన్, క్రిష్టారెడ్డి, గ్రంథాల్యధికారి సుధాకర్ ఉన్నారు.

**కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కొండాపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకపఠనం అలవర్చుకోవాలని లైబ్రరీయన్ వరలక్ష్మి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఖాజీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఖాజీపేటలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ నిర్వాహకులు హరికృష్ణ నిర్వహించారు. పాఠకులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు వస్తారని, వారికోసం ఆంగ్లం, ఉర్దూ, హిందీ బాషల్లో 7,848 పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులకు ఉపయోగపడే కాంపిటేటివ్ పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. మల్లారెడ్డి, ఎరికలరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రణాళికతో పనులు చేయాలి

ఖాజీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో జరిగే పనులు ప్రణాళికాబద్ధంగా చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం కూనవారిపల్లె పంచాయతీ పరిధిలో రూ.15 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, టీడీపీ నేతలు క్రిష్టారెడ్డి, గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.